సాక్షి చిత్తూరు

సోమవారం । 20 । మార్చి । 2023



22న కాణిపాకంలో ప్రత్యేక పూజలు

కాణిపాకం (యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు.



కిలకిల రావాలు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో వలస విహంగాల విన్యాసాల పక్షిప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. ఆదివారం వర్షం కురుస్తున్నా పలువురు విచ్చేసి పక్షుల నందడిని తిలకించారు.

ఉరమకే మేఘమా!



తిరుమల: తిరుమలలో ఆదివారం వర్షం ముంచెత్తింది. కానుకలు తడవకుండా హుండీలపై టార్పాలిన్ పట్టలు కప్పి పరకామణికి తరలించడం కనిపించింది. – తిరుమల

న్యూస్‌రీల్

బోయకొండలో భక్తుల రద్దీ



క్యూల్లో వేచి ఉన్న భక్తులు

చౌడేపల్లి: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరుగాంచిన బోయకొండ గంగమ్మ ఆశీస్సుల కోసం ఆదివారం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వర్షం కురుస్తున్నా అమ్మవారి ఆశీస్సుల కోసం క్యూ కట్టారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు రద్దీ కొనసాగింది.

పంటలపై ఒంటరి ఏనుగు దాడి



ధ్వంసమైన టమాట తోట

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాపల్లి పంచాయతీ అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాలైన కొత్తబూరగపల్లె, తిప్పిరెడ్డిపల్లె, పెద్దకాప్పల్లె, ముదిరెడ్డిపల్లె పంట పొలాల్లోకి ఒంటరి ఏనుగు చొరబడుతూ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. వరుసగా మూడో రోజు శనివారం రాత్రి కీలపట్ల ఫారెస్టు బీటు నుంచి వచ్చిన ఒంటరి ఏనుగు ముదిరెడ్డిపల్లెలో కృష్ణప్పకు చెందిన టమాట పంటపై దాడి చేసి తీవ్ర నష్టం చేకూర్చింది. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన కృష్ణప్ప ధ్వంసమై ఉన్న పంటను చూసి కన్నీరుమున్నీరయ్యాడు.

నేడు పోలీసు స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిషాంత్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డు రిజర్వ్‌డ్ (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పే ర్కొన్నారు.


సరిహద్దు అక్రమాలపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న కేజీఎఫ్ ఎస్పీ ధరణీదేవి

కుప్పం: ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మూడు రాష్ట్రాల పోలీసు యంత్రాంగాలు నిర్ణయించాయి. సరిహద్దు నేరాలను అరికట్టేందుకు కలసి కట్టుగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించాయి. ఆదివారం జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి సూచనల మేరకు కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ పట్టణంలోని ఓ ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం బార్డర్ క్రైం మీటింగ్ నిర్వహించారు. కేజీఎఫ్ ఎస్పీ ధరణీదేవి, పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి, తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి డీఎస్పీలు పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ మూడు రాష్ట్రాల పోలీస్ సిబ్బంది సరిహద్దు అక్రమ రవాణాలపై ఉక్కుపాదం మోపాలని సిబ్బందికి సూచించారు. రేషన్ బియ్యం, గంజాయి, కర్ణాటక నుంచి మద్యం అక్రమరవాణా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కోలార్ డీఎస్పీ రమేష్, కేజీఎఫ్ డీఎస్పీలు, కుప్పం రూరల్ సీఐ రియాజ్ అహ్మద్, రాళ్లబూదుగురు ఎస్ఐ మునుస్వామి పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో మదపుటేనుగు మృతి



తమిళనాడు రాష్ట్రంలోని ధర్మపురి వద్ద కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఏనుగు

పలమనేరు: తమిళనాడు పరిధిలోని ధర్మపురి వద్ద ఓ ఏనుగు కరెంట్ షాక్‌తో ఆదివారం రాత్రి మృతిచెందింది. స్థానిక ఫారెస్టు రేంజ్ పరిధికి 20 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అడవిలోంచి ఏనుగు పంటపొలాల్లోకి రాగా.. రైతులు దాన్ని మళ్లించేందుకు పెద్దగా కేకలు వేశారు. దీంతో ఏనుగు ఓ మిట్ట ఎక్కి అడవిలోకి వెళుతుండగా.. అక్కడ తక్కువ ఎత్తులో ఉన్న కరెంటు తీగలు తగిలి కన్నుమూసింది. దానికి తమిళనాడు అటవీశాఖ అధికారులు పోస్టుమార్టం నిర్వహించి.. విచారణ జరుపుతున్నారు.

తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన పేదల సొంతింటి కల సాకారం కానుంది. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా తామే యజమాని హోదాలో లబ్ధిదారులు పాలు పొంగించి గృహ ప్రవేశం చేయనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కలను నెరవేర్చాలని పరితపించారు. వారిపై అద్దె భారం పడకూడదని భావించారు. మహిళలకు సొంతిల్లు ఆస్తి హక్కుగా ఉండాలని సంకల్పించారు. అన్ని మౌలిక వసతులతో ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన ఆ ఇంటిని నిర్మించి కానుకగా ఇవ్వాలని కంకణబద్ధులయ్యారు. అధికారులు కూడా లక్ష్యాలను పూర్తి చేయడంలో శ్రమించారు. ఇప్పటికే పలుచోట్ల జగనన్న కాలనీల్లో సామూహిక గృహప్రవేశాలతో చాలా మంది సొంతింటి కలను నెరవేర్చుకున్నారు. మిగిలిన వారు ఉగాది పర్వదినాన గృహ ప్రవేశాలు చేసేలా జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

ఇంటికి ఉగాది!



పలమనేరు జగనన్న కాలనీలో నిర్మాణాలు

- జిల్లాలో శరవేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణం
- ఉగాది నాటికి 24,659 ఇళ్లు ప్రారంభం
- గృహప్రవేశాలకు సర్వం సిద్ధం
- తీరనున్న పేదల సొంతింటి కల సాకారం
- ఇళ్ల నిర్మాణం కోసం రూ.717 కోట్ల వ్యయం

సాక్షి, చిత్తూరు: జిల్లాలో జగనన్న కాలనీల్లో పూర్తయిన ఇళ్లలో ఉగాది శుభ ముహూర్తంగా బుధవారం లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాకు 2020–21 ఆర్థిక సంవత్సరానికి 72,225 గృహాలు మంజూరయ్యాయి. ఇందుకోసం రూ.1325 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 66 వేల ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించారు. ఇందులో సుమారు 58 వేల ఇళ్లు బేస్మెంట్, ఆపైస్థాయిలో నిర్మించారు. ఇందుకోసం రూ.717 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటికే పలుచోట్ల సామూహిక గృహ ప్రవేశాలు చేశారు. ఉగాది నాడు గృహ ప్రవేశాలు చేసేలా 24,659 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. జిల్లాలో గృహ నిర్మాణాల వేగవంతానికి జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో గృహ నిర్మాణాల కోసం అర్హులైన ప్రతి ఒక్కరిని లబ్ధిదారులుగా గుర్తించారు. నిర్మాణాల లక్ష్యాలు అందుకునేలా వారం వారం పర్యవేక్షిస్తూ , ఎక్కడైనా వేగవంతం కాకుంటే వెంటనే తగు చర్యలు తీసుకున్నారు. గతంలో హౌసింగ్ శాఖలో పనిచేసిన అనుభవం జాయింట్ కలెక్టర్‌కు ఉంది. అలాగే కలెక్టర్ లబ్ధిదారులకు డీఆర్‌డీఏ ద్వారా రుణాలు మంజూరు చేయించడంలో చొరవ చూపడంతో నిర్మాణాలు జిల్లాలో వేగవంతం అయ్యాయి. ఫలితంగా ఈ ఉగాది నాటికి మొత్తం 24,659 గృహాలు పూర్తి అయ్యాయి.



గుండ్రాజుకుప్పంలో ప్రారంభానికి సిద్ధమైన ఇల్లు



జగనన్న కాలనీని పరిశీలిస్తున్న అధికారులు



నగరి జగనన్న కాలనీలో నిర్మాణాలు



నాగరాజకుప్పంలో పూర్తయిన ఇల్లు

సొంతింటి కల నెరవేరింది



భర్తతో కలసి చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత పట్టాతో ఇంటి నిర్మాణం మంజూరైంది. ప్రభుత్వం డ్వాక్రా సంఘాల నుంచి రుణం మంజూరు చేయించడంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. సొంతింటి కల నెరవేరింది. ఉగాదికి గృహ ప్రవేశం చేయనున్నాం. – గిరిజ, కుప్పం

సులభంగా పూర్తి చేసుకున్నాం



మాది పేద కుటుంబం. నాభర్త పనిచేస్తేనే జీవనం సాగుతుంది. ప్రభుత్వం ఇంటి స్థలాలతో పాటు గృహ నిర్మాణానికి రుణం మంజూరు చేసింది. మహిళా సంఘాల నుంచి రుణం కూడా ఇవ్వడంతో ఇంటి పనిని సులభంగా పూర్తి చేసుకున్నాం. అద్దె ఇంట్లో కాలం వెళ్లదీస్తున్న మాకు సొంత ఇంటికి సంబంధించి అన్ని హక్కులు రావడం చాలా ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– జరీనా బేగం, వరత్తురు, గంగాధర నెల్లూరు

లబ్ధిదారులు యజమానులయ్యారు



అర్హులందరినీ గుర్తించి ఇంటి స్థలాలు ఇచ్చాం. లబ్ధిదారులు గృహ నిర్మాణ పనులు ప్రారంభించి వేగంగా నిర్మించుకున్నారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు సాగాయి. మరికొందరు ఇంకా పనులు చేస్తున్నారు. పనులు ఇంకా వేగవంతం చేస్తాం. లక్ష్యాలను అందుకునే ప్రక్రియలో క్షేత్ర స్థాయిలో సిబ్బంది సమష్టిగా శ్రమించారు. ఉగాది నాడు 24,659 ఇళ్లలో గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు సిద్ధం చేశాం. లబ్ధిదారులు సొంతిళ్ల యజమానుల య్యారు.

– ఎం.హరినారాయణన్, జిల్లా కలెక్టర్

అవన్నీ చెల్లని ఓట్లే!

- విస్తుపోయిన కౌంటింగ్ అధికారులు
- ఓటింగ్ ప్రక్రియపై సరైన అవగాహన లేకనే

చిత్తూరు కలెక్టరేట్ : తూర్పు రాయలసీమ పరిధిలోని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల టీచర్లు, పట్టభద్రుల ఎన్నికల్లో చెల్లని ఓట్లు నమోదయ్యాయి. ఈ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న వారందరూ టీచర్లు, పట్టభద్రులే. అయినప్పటికీ చెల్లని ఓట్లు వేశారు. కౌంటింగ్ ప్రక్రియలో చెల్లని ఓట్లను చూసి అధికారులు విస్తుపోయారు.

తప్పిదాలెన్నో

ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ పద్ధతిలో నిర్వహించడంతో ఈ ఎన్నికల్లో ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయాల్సి ఉంటుంది. అవగాహన లేక ఓటర్లు పలు తప్పిదాలు చేశారు. ప్రాధాన్యత ఓటు వేయాల్సిన చోట 1, 2, 3 నంబర్లు వేయకుండా పలు తప్పులు చేశారు. కొన్నిచోట్ల సున్నా వేయడం , టిక్ పెట్టడం, 1 నంబర్ వేయకుండా 2, 3 తదుపరి నంబర్లు వేశారు.

ఎక్కువ తప్పులు పట్టభద్రులవే

పట్టభద్రులే ఎక్కువ తప్పులు చేశారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో 2,69,339 ఓట్లు నమోదయ్యాయి. ఇందులో 20,979 ఓట్లు చెల్లనివి నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. 7.78 శాతం ఓట్లు చెల్లనివిగా నమోదు కావడం గమనార్హం. టీచర్ ఎన్నికల్లో 24,747 ఓట్లు పోలయ్యాయి. ఇందులో చెల్లని ఓట్లు 456.

టీడీపీది శునకానందం

- మంత్రి ఆర్కేరోజా ధ్వజం



మంత్రి ఆర్కేరోజా

నగరి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాల గెలుపుతో టీడీపీ పొందుతున్నది శునకానందమేనని మంత్రి ఆర్కేరోజా ధ్వజమెత్తారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సింహం పన్నెండు మందిని చంపినా అది వార్త కాదని, అదే పంది ఇద్దరిని చంపినా అదో పెద్ద వార్తవుతుందని అదే నేడు టీడీపీ పరిస్థితి అని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీ గుర్తుతో జరిగేవి కాదన్నారు. రెండో ప్రాధాన్యత లెక్కింపులో పీడీఎఫ్ అభ్యర్థుల మద్దతుతో గెలిచి టీడీపీ నాయకులు చంకలు గుద్దుకుంటున్నారన్నారు. ఇది వారికి బలుపు కాదని వాపు మాత్రమేనని ఆరోపించారు. ఒక్కో నియోజకవర్గంలో రెండు లక్షల ఓట్లుంటే ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగింది.. ఐదారు వేల ఓట్లకు మాత్రమే అన్నారు. ప్రభుత్వంపై టీచర్లు వ్యతిరేకంగా లేరని ఉపాధ్యాయ ఎమ్మెల్సీల గెలుపుతో తేలిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తొలిసారని, అదీ ప్రత్యేక పద్ధతిలో జరిగే ఎన్నికలని తెలిపారు. ఇప్పటివరకు ఈ ఎన్నికల్లో వామపక్షాల వారే గెలుస్తూ వచ్చారని, అయితే వారు రాజ్యాధికారం పొందింది లేదన్నారు. అదే టీడీపీ విషయంలోనూ జరుగుతోందని పేర్కొన్నారు. విద్యావంతులు తమకు ఓటేశారని చంద్రబాబు అంటున్నారని. బాబు వస్తే జాబు వస్తుందని చెప్పి ఆయన కుమారునికి మాత్రం జాబిచ్చారని అందుకు ఆయనకు ఓటేశారా, అనుభవం ఉందని రాష్ట్రాన్ని ఆయన చేతిలో పెడితే రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచినందుకా చెప్పాలన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు ఎలా వచ్చిందో తెలియక టీడీపీ వారే కన్ఫ్యూజన్‌లో ఉన్నారని ఆరోపించారు. పార్టీ సింబల్‌తో ఏ ఎన్నిక వచ్చినా అది వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి వార్ వన్‌సైడ్ అన్న ధోరణిలోనే జరుగుతుందని రోజా స్పష్టం చేశారు.

వణికించిన వడగళ్ల వాన





రొంపిచెర్ల : దెబ్బతిన్న దోస పంట,(ఇన్‌సెట్) పగిలిపోయిన కాయలు, పుంగనూరు : దెబ్బతిన్న టమాట తోట

- పలు మండలాల్లో భారీ వర్షం
- ఉద్యాన పంటలకు రూ.4.67 కోట్ల నష్టం
- పిడుగుపాటుకు పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు
- రొంపిచెర్ల మండలంలో 71 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో అకాల వర్షాలు బెంబేలెత్తిస్తున్నాయి. శనివారం రాత్రి, ఆదివారం కొన్ని మండలాల్లో వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. పలు మండలాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతినడంతో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. భారీ పరిమాణంలో ఉన్న వడగళ్లను చూసి రైతులు కంగుతిన్నారు. రొంపిచెర్ల మండలంలో అత్యధికంగా 71.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకాగా, వెదురుకుప్పం మండలంలో పిడుగుపాటుకు ఒక ఇల్లు పాక్షికంగా దెబ్బతినింది. జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రానికి 464 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినగా రూ.4.67 కోట్లు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు ఉద్యానశాఖ డీడీ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆదివారం పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

- పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి, పలమనేరు మండలాల్లో ఆదివారం వడగళ్ల వాన కురవడంతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.
- పుంగనూరు నియోజకవర్గంలో వడగళ్ల వాన పెద్ద ఎత్తున కురవడంతో దాదాపు 450 ఎకరాల్లో పంటలు దెబ్బతిని రూ.5 కోట్ల వరకు నష్టం వాటిల్లింది.
- గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. వెదురుకుప్పం మండలం ఎర్రగుంటలో పిడుగు పడడంతో ఒక ఇళ్లు పాక్షికంగా దెబ్బతింది.

రొంపిచెర్లలో 71.2 మిల్లీ మీటర్ల వర్షం

జిల్లాలో శనివారం రాత్రి ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా రొంపిచెర్ల మండలంలో 71.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకాగా, అత్యల్పంగా శాంతిపురం మండలంలో 0.8 మిల్లీమీటర్ల మేర వర్షం కురిసింది. పులిచెర్లలో 62.2, పుంగనూరు 62, సదుం 32.2 , పెద్దపంజాణి 28.2, చౌడేపల్లెలో 26.6, గంగవరంలో 26.4, బంగారుపాళ్యంలో 25.2, యాదమరిలో 25, చిత్తూరు, బైరెడ్డిపల్లెలో 24.2, పెనుమూరులో 24, వెదురుకుప్పంలో 23.6, తవణంపల్లెలో 22.4, జీడీ నెల్లూరులో 21.4, పలమనేరులో 20.6, కార్వేటినగరంలో 20.4, ఐరాలలో 16.2, నింద్రలో 15.4, గుడిపాలలో 15.2, వి.కోటలో 13.8, సోమలలో 10.8, పాలసముద్రంలో 10.2, పూతలపట్టులో 9.8, నగరిలో 9.4, విజయపురంలో 8.2, ఎస్ఆర్ పురంలో 7.2, రామకుప్పంలో 2.8 మిల్లీ మీటర్ల మేరకు వర్షపాతం నమోదైంది.



రొంపిచెర్లలో పడిన వడగళ్లు

విద్యుత్‌శాఖకు నష్టం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్‌లో శనివారం రాత్రి కురిసిన గాలివానకు విద్యుతుశాఖకు నష్టం ఏర్పడింది. డివిజన్ పరిధిలో మొత్తం 4 విద్యుత్ స్తంభాలు, 3 ట్రాన్స్‌ఫార్మర్లు, 10 ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సిబ్బంది సంరక్షణ పనులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు.

విద్యకు సర్కారు ప్రాధాన్యం

- జిల్లాలో 35,114 మంది విద్యార్థులకు రూ.20.94 కోట్లు జమ
- నేను ఫీజురీయింబర్స్‌మెంట్ కు చాలా ఇబ్బందులు పడ్డా : జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్
- పాల్గొన్న నగర మేయర్ అముద, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్: విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని నగర మేయర్ అముద, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో విద్యాదీవెన కార్యక్రమం జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర మేయర్ అముద మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం టీడీపీ ఎటువంటి మేలు చేయలేదన్నారు. గతంలో విద్యార్థులు ఫీజురీయింబర్స్‌మెంట్ పొందాలంటే ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవన్నారు. వైఎస్సార్ సీపీ సర్కారు పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో మేలు చేస్తోందని చెప్పారు. ఈ పథకం కింద సకాలంలో ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను తల్లుల ఖాతాల్లో జమచేస్తోందన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ప్రయోజనం కలుగుతోందని తెలిపారు.

అప్పట్లో ఇబ్బందులు ఎదుర్కొన్నా..

అప్పట్లో తాను ఉన్నత విద్య చదివేటప్పుడు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఉన్నత చదువు అభ్యసించే రోజుల్లో వెల్ఫేర్ ఆఫీసర్లు ఫీజురీయింబర్స్‌మెంట్ వచ్చిందనడం, కళాశాల యాజమాన్యం రాలేదనడం, బ్యాంకు ఖాతాలు సరిలేదని చెప్పడం ఇలాంటి సమస్యలు ఎదుర్కొన్నట్లు చెప్పారు. ప్రస్తుతం అలాంటి సమస్యలేమి లేవన్నారు. విద్యార్థుల్లో బాధ్యత ఉండాలనే అటెండెన్స్‌ను లింక్ చేశారని చెప్పారు. జిల్లాలో 35,114 మంది విద్యార్థులకు రూ.20.94 కోట్లు 31,979 మంది తల్లుల ఖాతాలకు జగనన్న విద్యాదీవెన నిధులు జమచేశారని జేసీ వెల్లడించారు. జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి రాజ్యలక్ష్మి, గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, జిల్లా మైనారిటీ శాఖ అధికారి చిన్నారెడ్డి, పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ శాఖల పరిధిలో ఇలా..

సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 7,858 మంది విద్యార్థులకు రూ.5,91,98,165, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 682 మంది విద్యార్థులకు రూ.31,42,350, వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ పరిధిలో 15,882 మంది విద్యార్థులకు రూ. 8,08,42,239 ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన నిధులు జమచేసింది. అలాగే ఆర్థికంగా వెనుకబడిన కులాల సంక్షేమ పరిధిలో 4,866 మంది విద్యార్థులకు రూ.3,52,99,763, కాపు కులాల సంక్షేమ పరిధిలో 3,452 మంది విద్యార్థులకు రూ. 1,94,29,623, ముస్లిం మైనారిటీ సంక్షేమ పరిధిలో 2,324 మంది విద్యార్థులకు రూ.1,11,99,616, క్రిస్టియన్ మైనారిటీ సంక్షేమం కింద 50 మంది విద్యార్థులకు రూ.2,80,336 ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన నిధులు జమ చేసింది.



పాల్గొన్న విద్యార్థులు, సంక్షేమ శాఖ అధికారులు





దూసుకు పోతున్న కోడెగిత్తలు



కోడెగిత్తను నిలువరిస్తున్న యువకులు

పెద్దబైలులో నువ్వా-నేనా!

కుర్రకారు హుషారు... కోడె గిత్తల జోరుతో ఆదివారం వెదురు కుప్పం మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ పెద్ద బైలు గ్రామంలో జల్లికట్టు దమ్మురేపింది. ఎద్లను ముస్తాబు చేసి విడతల వారీగా పందేనికి ఉసిగొల్పారు. కోడెగిత్తలు రంకెలేస్తూ జన ప్రవాహాన్ని చీల్చుకుంటూ పరుగులు తీశాయి. ఎద్ల వేగాన్ని నిలువరించి కట్టడి చేసేందుకు నువ్వా-నేనా అన్నట్లు యువకులు ఉత్సాహం చూపారు. కొన్ని ఎద్లను నిలువరించి యువకులు కేరింతలు కొట్టారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన జనంతో గ్రామంలో సందడి నెలకొంది.

\- వెదురుకుప్పం

జగమంత కుటుంబం నాది..

ఆనందంగా కొనసాగుతున్న జీవితంలో చిన్నపాటి మనస్పర్థలు. క్షణికావేశంలో ప్రాణాలు విడిచిన భార్య. మనస్పర్థలు లేకుంటే జీవితాంతం భార్య ప్రేమను పంచుతూ ఉండేది కదా అన్న మనోవ్యధ. తనకంటూ ఎవ్వరూ లేకున్నా జగమంత కుటుంబం నాది అన్న తలంపు.. పరోపకారంలో ప్రశాంతత వెతుక్కుంటూ పది మందికి కడుపు నింపుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు నగరికి చెందిన వెంకటేశ్ అనే రిక్షావాలా.



రిక్షా తొక్కుతున్న వెంకటేశ్

- రోజూ పదిమంది పేదలకు టిఫన్
- మానవసేవే మాధవ సేవంటూ ఐదేళ్లుగా సాయం
- మనోవ్యధకు మందుగా పరోపకారం
- ఆదర్శంగా నిలుస్తున్న రిక్షావాలా



నిరాశ్రయులకు టిఫిన్ ప్యాకెట్లు అందిస్తున్న వెంకటేశ్

నగరి : నగరి పట్టణం రామ్‌నగర్‌కు చెందిన వెంకటేశ్ (48) పరోపకారంలో ఆదర్శంగా నిలుస్తున్నాడు. జన్మస్థలం తమిళనాడుకు చెందిన దిండివనం. వడివేలు, వళ్లి దంపతుల కుమారుడు. పాతికేళ్ల కిందట కుటుంబసభ్యులను విభేదించి భార్య రాణితో కలిసి జీవనోపాధి వెతుక్కుంటూ నగరి పట్టణానికి వచ్చాడు. తొలుత థమ్స్‌అప్ కంపెనీలో రిక్షాపై లోడ్ తీసుకెళ్లే పనిలో చేరాడు. ఆపై సొంతంగా లోడ్ రిక్షా నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఐదేళ్ల కిందట భార్యాభర్తల మధ్య చిన్నపాటి మనస్పర్థలు వచ్చాయి. క్షణికావేశంలో భార్య ఆత్మహత్యకు పాల్పడింది. మనస్పర్థలు రాకుండా ఉంటే భార్య మృతి చెందేది కాదుకదా అన్న మనోవ్యథ అతన్ని కలచివేసింది. తనకంటూ ఎవరూ లేని ఒంటిరిగా మిగిలిపోయాడు. తనను నమ్మి తనతో పాటు వచ్చిన భార్యను పోగొట్టుకున్నానే అన్న బాధతో కంటికి కునుకులేకుండా పోయింది. మానవసేవతో మనసును కుదటపరచుకోవచ్చని చెప్పే సిద్ధాంతాన్ని పాటించాలనుకున్నాడు. నాటి నుంచి ఐదేళ్లుగా తనకున్నదాంతో పరులకు సాయం చేస్తున్నాడు. మున్సిపల్ పరిధి కొత్తపేట అగరవినాయక స్వామి ఆలయం వద్ద 10 మంది నిరాశ్రయులకు రోజూ ఉదయం టిఫన్ అందిస్తున్నాడు. రోజూ కష్టపడితే రూ.500 దాకా వస్తుందని, అందులో కొంత పేదల ఆకలి తీరుస్తున్నట్లు చెబుతున్నాడు.

ఆవేశంలో తప్పుడు నిర్ణయాలు వద్దు

'మనస్పర్థలు వచ్చే సమయంలో క్షణికావేశంలో తీసుకునే తప్పుడు నిర్ణయం కుటుంబాన్ని నాశనం చేస్తుంది. అలాంటి తప్పుడు నిర్ణయాల జోలికి వెళ్లొద్దు. నా భార్య అంటే నాకు ఎంతో ఇష్టం. ఆమె క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం నన్ను ఒంటరిని చేసింది. నాకు జీవితకాలం శిక్షగా మారింది. ప్రస్తుతం నాకంటూ ఎవ్వరూ లేరు. మనసాక్షి అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకున్నా. పరోపకారంతో ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నా. పది మందికి సాయం చేశానన్న తృప్తితో మనోబాధకు మందు వేసుకుంటున్నా. అందరూ నా కుటుంబ సభ్యులే అనుకుంటాను. నా కంటూ పది మంది ఉన్నరన్న భావన నాలో కలుగుతుంది'.

\- వెంకటేశ్, రిక్షావాలా, నగరి

గ్రామ సచివాలయంపై ఇటుకలతో దాడి





ఇటుకల దాడి జరిగిన సచివాలయ భవనం, సీఎం చిత్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఇటుకలు విసిరిన ఆనవాలు

శాంతిపురం: కుప్పం నియోజకవర్గం, శాతిపురం మండలం, కొలమడుగు గ్రామ సచివాయంపై ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని లక్ష్యంగా చేసుకుని తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు యువకులు ఇటుక రాళ్లతో దాడి చేశారు. శనివారం రాత్రి వి.కొత్తూరు గ్రామానికి చెందిన సంతోష్, రాజేష్ మద్యం మత్తులో కొలమడుగు గ్రామ శివార్లలోని సచివాలయం వద్దకు వచ్చారు. సీఎంను, అధికార పార్టీని దుర్భాషలాడుతూ సచివాలయంపై ఉన్న సీఎం చిత్రపటంపైకి ఇటుక రాళ్లను విసిరారు. కేకలతో ఆ ప్రాంతంలో హడావుడి చేశారు. సమీపంలో నివాసం ఉంటున్న వారు దీనిని అడ్డుకున్నా ప్రయోజనం లేకపోవడంతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మద్యం మత్తులో ఉన్న వారిని రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై స్థానిక సర్పంచ్ మంగమ్మ ఫిర్యాదు మేరకు రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

24 టన్నుల రేషన్ బియ్యం సీజ్





లారీ డ్రైవర్‌ను విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు, సీజ్ చేసిన వాహనం

కుప్పం: కర్ణాటక రాష్ట్రం బంగారు పేటకు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 24 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని బైరుగానిపల్లె వద్ద బియ్యం బస్తాల ప్యాకేజీ యూనిట్‌పై వచ్చినా సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ మల్లికార్జున బృందం దాడులు చేపట్టారు. లారీల ద్వారా కర్ణాటకకు తరిలించేందుకు సిద్ధంగా 24 టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమిళనాడు రాష్ట్రం నుంచి, కుప్పం పరిధిలోని గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేసి బైనుగానిపల్లె వద్ద ఉన్న మిల్లుకు తరలిస్తున్నారని తెలిపారు. అక్కడ పాలిష్ చేసి ప్రత్యేకంగా 25 కేజీల బ్యాగ్‌లుగా ప్యాక్ చేసి వివిధ బ్రాండ్ల పేరిట విక్రయాలు చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందని పేర్కొన్నారు తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

శ్మశాన స్థలం వివాదంపై చర్చలు



శ్మశాన స్థల వివాదంపై ఇరువర్గాల వారితో చర్చిస్తున్న అధికారులు

ఐరాల: మండలంలోని కామినాయనపల్లె దళితవాడ వాసుల శ్మశాన స్థల వివాదంపై ఆదివారం అధికారులు ఇరువర్గాల వారితో చర్చించి ఉగాది తర్వాత సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దళతవాడకు చెందిన ఓ మహిళ ఆదివారం మృతి చెందింది. పూర్వీకుల నుంచి కొన్ని సంవత్సరాలుగా శ్మశానంగా వాడుకుంటున్న స్థలంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ఏర్పాట్లు చేశారు. ఈ సమయంలో అగ్రకులానికి చెందిన కొందరు ఆ స్థలం తమ అనుభవంలో ఉందంటూ అడ్డుకున్నారు. దీంతో దళితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముందుస్తు చర్యలో భాగంగా గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ సుశీలమ్మ నేతృత్వంలో ఐరాల ఎస్ఐ వెంకటేశ్వర్లు, పూతలపట్టు ఎస్ఐ హరిప్రసాద్ అక్కడికి చేరుకున్నారు. దళితులు, అగ్రకులాల వారితో చర్చలు జరిపారు. గతంలో ఈ వివాదంపై ఎస్సీ కమిషన్, కోర్టుకు వెళ్లగా ఆ స్థలం అగ్రకులాలకు చెందిన వారిదేనని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని దళితులకు తహసీల్దార్ గుర్తు చేశారు. అయినా అంత్యక్రియలు ఆ స్థలంలోనే నిర్వహిస్తామనడం సబబు కాదన్నారు. ప్రత్యామ్నాయ స్థలంలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించుకోవాలని సూచించారు. ఉగాది తర్వాత శ్మశాన స్థలంపై శాశ్వత పరిష్కారం చూపుతామని అధికారులు హామీ ఇవ్వడంతో వారు వేరే ప్రాంతంలో అంత్యక్రియల కోసం ఏర్పాట్లు చేసుకున్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు





ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు, ఎస్సీ, ఎస్టీ చైర్మన్ విక్టర్ ప్రసాద్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు, ఎస్సీ, ఎస్టీ చైర్మన్ విక్టర్ ప్రసాద్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

సామాజిక చైతన్యం రచయితల చేతుల్లోనే ..



ఉగాది స్మారక పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

పలమనేరు: సమాజంలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత నేటితరం రచయితలపై ఉందని ప్రముఖ రచయిత భూమన్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణ సమీపంలోని కళాక్షేత్రంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజం పురోగమించేందుకు బదులు తిరోగమనంలోకి వెళుతుండడం బాధాకరమన్నారు. విద్యావంతులు సాహిత్యంతో సామాజిక మార్పునకు కృషి చేయాలన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య కుసుమ కుమారి మాట్లాడుతూ పలమనేరు లాంటి చిన్నపట్టణంలో ఇంత పెద్దఎత్తున సామాజిక కార్యక్రమాలను చేపట్టడం పెద్దవిషయమేనన్నారు. ఈ సందర్భంగా 25 మంది కవులను ఉగాది పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. నీతి పద్యాల పోటీల్లో గెలుపొందిన 20 మంది విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు, పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. అనంతరం ఆరుగురు కవులకు జాతీయ స్మారక పురస్కారాలు అందజేశారు. ఖాదర్‌ఖాన్ స్మారక పురస్కారాన్ని తులసీనాథం నాయుడుకు, ఎంఎస్ మణి పురస్కారాన్ని కుమారస్వామి రెడ్డికి, గీతాంజలి పురస్కారాన్ని డాక్టర్ మౌనిక, జే.రామకృష్ణశర్మ పురస్కారాన్ని విజయలక్ష్మి, కోటిరెడ్డి పురస్కారాన్ని రామిరెడ్డికి అందజేశారు. రచయితలు సుదర్శనాచారి, శివశంకర్, విమల, పలమనేరు బాలాజీ, గురుమూర్తి, సమితి కార్యదర్శి పుష్ప, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం



సీజ్ చేసిన ఎర్రచందనం దుంగలు, వాహనం

యాదమరి: మండల పరిధిలోని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని వరిగపల్లె వద్ద వాహనం సహా 9 ఎర్రచందన దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్ఓ వెకటరమణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎర్రచందనం అక్రమ రవాణ జరుగుతున్నట్లు తెలియడంతో వరిగపల్లె వద్ద ఆదివారం వేకువజామున వాహనాలు తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. బొలేరో వాహనం వేగంగా రావడంతో ఆపగా, డ్రైవర్ ఆపి చీకటిలో పరారయ్యాడని తెలిపారు. అనుమానం వచ్చి వాహనం తనిఖీ చేయగా అందులో 9 ఎర్రచందన దుంగలు ఉన్నాయని, వీటి బరువు 267 కిలోలు ఉండవచ్చని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి ఎర్రచందన దుంగలు, వాహనం సీజ్ చేసినట్లు తెలిపారు. వీటి విలువ రూ.12లక్షల వరకు ఉంటుందన్నారు. అటవీశాఖ అధికారులు ప్రతాప్, కుప్పస్వామి తదితరులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

గేట్‌లో ఆలిండియా ర్యాంకు



సాయికుమార్‌రెడ్డి

భాకరాపేట : తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, చిన్నగొట్టిగల్లు మండలం, చట్టేవారిపాళెం పంచాయతీ, బద్దలవారిపల్లెకు చెందిన రైతు బిడ్డ బద్దల సాయికుమార్‌రెడ్డి గేట్‌లో ఆలిండియా ర్యాంకు 107 సాధించాడు. గ్రామానికి చెందిన అమరనాథ్ రెడ్డి, రాజేశ్వరి దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి రెండవ కుమారుడైన సాయికుమార్‌రెడ్డి ప్రస్తుతం ఎన్ఐటీ మిజోరాంలో బీటెక్ ఫైనల్‌ఇయర్ చదువుతున్నాడు. ఎంటెక్ (సీఎస్ఈ) చేయాలన్న లక్ష్యంతో గేట్ రాశాడు. ఆలిండియా స్థాయిలో 107 ర్యాంకుతో సాధించాడు. మొదటి కుమారుడు సంతోష్‌రెడ్డి ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీట్ సాధించి కడప రిమ్స్‌లో ఫైనల్ ఇయర్ చేస్తున్నాడు. ర్యాంకు సాధించిన రైతు బిడ్డ నియోజకవర్గానికి గుర్తింపు తెచ్చారని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు.

భూ వివాదంతోనే వృద్ధుడి హత్య



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగసుబ్బన్న

వెంకటగిరిరూరల్ : మండలంలోని పారవోలు దళితవాడలో శుక్రవారం రాత్రి జరిగిన వృద్ధుడు కృష్ణయ్య హత్యకు భూవివాదమే కారణమని డీఎస్పీ నాగసుబ్బన్న తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ పాత కక్షలను మనసులో పెట్టుకునే నిందితుడు తూపిలి సుబ్రమణ్యం పథకం ప్రకారం కృష్ణయ్యను కడతేర్చినట్లు చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ జిలానీ పాల్గొన్నారు.